


# పాఠం

బెహరా వెంకటసుబ్బారావు

ఆ రోజు రాత్రి విశ్వనాథానికి నిద్ర రాలేదు. నిలువుగుడ్లు పడిపోయాయ్ అతనికి. వేగంగా తెల్లవారాలి! అందరికన్నా ముందుగా ఆఫీసుకు వెళ్లాలి! రాత్రి చూపిన దృశ్యాన్ని అందరికీ వివరించాలి! చిలవలూ పలవలూ చేర్చి అందంగా చెప్పాలి. అందర్నీ ఆశ్చర్యంలో ముంచెత్తేయాలి! విశ్వనాథానికి ఎప్పుడు నిద్ర

వచ్చిందో తెలియదుగానీ తెలివి వచ్చేసరికి భళ్ళున తెల్లారిపోయింది. ఉత్సాహంగా లేచి, కాలకృత్యాలు తీర్చుకొని హోటలులో నాలుగు మెతుకులు తిని తొమ్మిదిన్నర అయేసరికి ఆఫీసు చేరుకున్నాడు.

ఆ ఆఫీసులో డిస్పాచింగ్ క్లార్కు విశ్వనాథం. విశ్వనాథం ఆఫీసులో అడుగుపెట్టేసరికి అప్పటికే ముగ్గురు గుమాస్తాలు చేరి కబుర్లు చెప్పుకొంటున్నారు. ఎప్పుడూ అరగంటకు తక్కువ లేకుండా ఆలస్యంగా వచ్చే విశ్వనాథం అరగంట ముందుగా రావడంతో వాళ్ళకు ఆశ్చర్యం వేసింది. వాచీలు చూసుకున్నారంతా అనుమానంగా.

"విశ్వనాథంగారి వాచీ ఫాస్టు నడుస్తున్నట్లుంది!" అన్నాడు యూడీసీ వెంకట్రావు పలకరింపుగా తనవైపే వస్తూన్న విశ్వనాథాన్ని చూస్తూ.

"అయ్యా! వెంకట్రావుగారూ! నా వాచీయే కాదు ఈ ప్రపంచమే ఫాస్టుగా తిరుగుతోంది.

పార్టీ ఫిరాయింపులు ఫాస్టుగా జరిగిపోతున్నాయ్!

ప్రభుత్వాలు ఫాస్టుగా మారిపోతున్నాయ్!

ధరలు ఫాస్టుగా ఎగిరిపోతున్నాయ్.

ఇక మనుషులు ఫాస్టు. ప్రేమికులు ఫాస్టు! అంతా ఫాస్టుమయం కదండీ!" అంటూ ఓ స్టూలును దగ్గరగా తెచ్చుకొని వెంకటరావుకు ఎదురుగా కూర్చున్నాడు విశ్వనాథం.

విశ్వనాథం ఏదో విషయం గురించి చెప్పదల్చుకున్నట్లు అందరికీ అర్థం అయింది.

"అన్నీ ఫాస్టేగానీ మన ఆఫీసు డిస్పాచ్ మాత్రం డెడ్ స్లో!" అన్నాడు ఎల్‌డీసీ బ్రహ్మచారి షణ్ముగం. వేళాకోళం మిళాయిస్తూ నిష్ఠూరంగా నిజం చెప్పాడు.

"మన డిస్పాచింగ్ ఎంత స్లో అని మీరన్నా లెటర్సుని సైకిలు మీద స్పీడుగా పంపించి మెయిన్ పోస్టాఫీసులో పోస్టు చేయించి మెయిల్‌ను కాచ్ చేయిస్తా. ఏమనుకున్నారో మరి!"

తక్కున సమాధానం యిచ్చాడు విశ్వనాథం.

"అది సరేగానీ ఏమిటి విశేషం?" కలుగచేసుకొన్నాడు రామారావు వాళ్ళ ధోరణిని అరికట్టించే ఉద్దేశంతో.

"విశ్వనాథం ఎర్లీగా రావడమే ఓ విశేషం!"

మరలా అందుకొన్నాడు షణ్ముగం.

"అబ్బ! క్షణకాలం ఊరుకోవయ్యా షణ్ముగం!" విసుక్కొన్నాడు అంతవరకూ మౌనంగా వున్న

మరో బ్రహ్మచారి అవధాని.

"ఆఁ చెప్పండి! ఏవిటి విశేషాలు విశ్వనాథంగారూ!" కుతూహలంగా అడిగాడు వెంకటరావు.

ప్రశ్న వేయించుకొన్న తరువాతనే జవాబు చెప్పడం విశ్వనాథంకు సరదా, అలవాటూను. ఆ సంగతి వెంకటరావుకు తెల్సు. విశ్వనాథంవైపు ముగ్గురూ ఆతృతగా చూసారు.... కొన్ని క్షణాలు వారిని ఊరించి విశ్వనాథం సన్నని పూసలలో దారం గుచ్చాడు. గత రాత్రి తాను లీలామహల్ దగ్గర 9.45 నిమిషాలకు చూపిన దృశ్యాన్ని వివరించాడు.

"ఆఁ" అంటూ అందరూ ఆశ్చర్యంతో వెనక్కు జారపడిపోయారు. షణ్ముగం కూర్చున్నది స్టూలుగాబట్టి వెనక్కు పడబోయి రామారావు టేబులును ఆనుకొని ప్రమాదం నుండి బయట పడ్డాడు.

"నిజమా! నేను నమ్మను!" అన్నాడు షణ్ముగం అసూయగా.

"మీరు నమ్మరని నాకు తెల్సు. కళ్ళతో చూసినవాడిని నాకే నమ్మకం కుదరలేదు, పట్టి పట్టి చూసాక గాని....కానీ యిది మాత్రం నిజం, మన ఆఫీసరుమీద ఒట్టు!"

మేగ్జిమమ్ ఒట్టు వేశాడు విశ్వనాథం వాళ్ళని నమ్మించే ప్రయత్నంలో.

ఒకరూ యిద్దరూ చిన్నా, పెద్ద అందరు గుమాస్తాలూ ఆఫీసుకు చేరుకొన్నారు పదిగంటలూ అయేసరికి. విశ్వనాథం తెచ్చిన వార్త విన్నారు. కొందరు నమ్మారు, కొందరు నమ్మలేదు, ఆఫీసు మానేజరు కూడా నమ్మలేదు, ఇంతలో ట్రిమ్‌గా తయారయి ఈలవేసుకొంటూ హుషారుగా వచ్చాడు ఎల్డీ లక్ష్మణరావు. అంతా పరీక్షగా చూసారు అతనివైపు. కొందరు ఈర్ష్యగా చూసారు. అతని వెనుకనే టైపిస్టు శశిరేఖ ఆఫీసులోకి అడుగు పెట్టింది, అందరికీ ఆమెనుకూడా పరీక్షగా చూడాలనిపించింది, కొందరు చూసారు, కొందరు చూడలేక పోయారు.

మానేజరు టేబిలు మీద నున్న ఎటెండెన్సు రిజిష్టరులో సంతకం చేసి, విలాసంగా నవ్వుమొహంతో తన గదిలోకి పోయింది శశిరేఖ. రిజిష్టర్‌లో సైను చేస్తూంటే పరీక్షగా చూసాడు మానేజరుశశిరేఖని. కొత్తగా కనిపించింది అతనికి. పదిన్నరయినా ఫయిల్సు విప్పలేదు కొంతమంది. ఫయిల్సు బయటకు తీసిన కొద్దిమందీ వాటిలో బుర్ర దూర్చలేదు. జేబుల్లోంచి పెన్నులు బయటకు తీయలేదు.

ఇంతలో ఓ కుర్రాడు పరుగు పరుగున వచ్చి మానేజరుకు ఓ కాగితం అందించాడు.

"అర్జంటుగా పనుండి వాళ్ళూరు కాకినాడ వెళ్తున్నారండీ! ఈ లీవు లెటరు మీకిమ్మన్నారు" అన్నాడు ఆ కుర్రాడు తనవైపే చూస్తూన్న మానేజరుతో. మానేజరు లెటరు చదువుతూంటే అందరూ అతని వైపు చూడసాగారు. మానేజరు మొహంలో రంగులు మారుతు న్నాయ్.

"శశిధర్ మీ యింట్లో వుంటు న్నాడా?"

"అవునండి!" అన్నాడు కుర్రాడు పేపరు వెయిట్‌ను చేతి లోకి తీసుకొంటూ.

"సరే నువ్వెళ్ళు!" అన్నాడు మానేజరు.

ఆ కుర్రాడు వెనక్కి చూడ కుండా తుర్రుమన్నాడు. అందరికీ అర్థం అయిపోయింది. "శశిధర్ ఆఫీసుకు శలవు పెట్టాడు!" అని.

"అవును మరి! మొహం ఎలా చూపించగలడు!"

"ఇక నీ ఆఫీసులో జాయిన్ కాడు! ట్రాన్స్ఫర్‌కి ట్రై చేసు కొంటాడు"

"ఎంత దగా! ఎంత మోసం!"

"విశ్వనాథం చెప్పింది నిజమే"

"లక్ష్మణరావు లక్కీ ఫెలో!"

ఎవరికి తోచినట్లు వాళ్ళనుకు న్నారు. విశ్వనాథం అందర్నీ పరీ క్షగా చూశాడు. "ఇప్పుడైనా నమ్ముతారా?" అన్నట్లు.

* *

శశిధర్ బ్రహ్మచారి. ఆ మాట కొస్తే ఆ ఆఫీసులో అవధానీ, ఆచారీ, షణ్ముగం, లక్ష్మణరావూ వీరంతా బ్రహ్మచారులే! శశిరేఖా శశిధర్ యిద్దరూ ప్రేమించు కొన్నారు. ఆ విషయం ఆ ఆఫీసులో అందరికీ తెల్సు. ఆఫీసరుకు కూడా! లక్ష్మణరావు శశిరేఖను స్వంతం చేసుకోవాలని చాలా చాలా ప్రయత్నం చేశాడు. ఇంకా చేస్తు న్నాడు కూడా! ఆమెను ఆకర్షిం చాలని అన్ని విధాలా తాపత్రయ పడుతున్నాడు.

ఆ ముందు రోజు రాత్రి జరుగ కూడనిది జరిగిపోయింది. చూడ కూడనిది చూసాడు విశ్వనాథం. చెప్పకూడనిది చెప్పేసాడు అంద రికీ. వినకూడనిది అందరూ వినే సారు. నమ్మలేనిది కూడా నమ్మే సారు. దానికితోడు శశిధర్ ఆఫీ సుకు రావడం మానేసాడు. సెలవు పెట్టేసాడు.

అస లేం జరిగిందంటే....

క్రిందటిరోజు రాత్రి బ్రహ్మ

చారి విశ్వనాథం మామూలుగా లీలామహల్ దగ్గరికెళ్లి కిళ్లీకొట్టు దగ్గర నిలబడ్డాడు కిళ్ళీకి ఆర్డరిచ్చి. అంతలో ఓ రిక్షా దూసుకొచ్చింది. అందులోంచి లక్ష్మణరావూ శశి రేఖా యిద్దరూ కేరింతలు కొడుతూ దిగారు. రిజర్వ్‌డు టిక్కెట్స్ తీసుకొని లోనికి పోయారు. దూరం నుంచి చూసిన విశ్వనాథానికి నమ్మకం చాల్లేదు. దగ్గరగా వెళ్ళి వాళ్ళకు కనబడకుండా చూసాడు. వాళ్ళేనని నిర్ధారణ చేసుకున్నాడు. శరీరం పులకరించింది! తేలు కుట్టలేదుగానీ కన్ను కుట్టింది. ఒళ్లు మండింది. బాధగా రూమ్ చేరుకొన్నాడు. శివజాగారం చేసాడు తెల్లవారి ఆఫీసుకొచ్చాడు ఎర్రబారిన కళ్ళతో కొయ్యబారిన మనసుతో.

ఆచారీ, అవధానీ, షణ్ముగం - లక్ష్మణరావు చుట్టూ మూగారు. కంగ్రాచ్యులేషన్స్ చెప్పారు. పార్టీ కావాలన్నారు.

"లేకపోతే పేర్లు కల్పాయని శశిధర్‌గాడికి అంత తల బిరుసా?"

"తనే మన్మధుడనుకొన్నాడు!"

"మనవాడి ముందు వాడు త్రిబుల్ ఫైవ్ ముందు చార్మినార్!"

"వట్టి అమాయకుడురా!"

"అతివల ఆంతర్యం అర్థం చేసుకోలేని అవివేకి!"

తమ అక్కసు వెళ్ళకక్కుకున్నారంతా లక్ష్మణరావు ముందు. వెంటనే పార్టీ యిచ్చేయడానికి వొప్పేసుకొన్నాడు లక్ష్మణరావు.

లంచవరు లవ్లీగా గడిచిపోయింది. ఆఫీసరు ఆ రోజు కేంపులో ఉన్నాడు కాబట్టి అడిగేవాడు లేడు.

మా నేజరును లక్ష్యపెట్టే లక్షణం అసలు ఎవరికీ లేదు.

*  *

"శశీ!"

"ఊఁ"

"మాట్లాడు శశీ!"

"ఏం మాట్లాడను?"

"ఈ బీచ్‌లో యిలా యిద్దరం కూర్చొని వుంటే, ఈ చల్లగాలిలో, ఆ కెరటాల నురగలు వెన్నెట్లో మెరిసిపోతూ వుంటే మనసులు మురిసిపోతున్నాయ్ కదూ!"

"................"

"మాట్లాడవేం శశీ? నీ కెలా వుంది?"

"నాకు చలేస్తోంది!" అంది నవ్వుతూ

"చంపేవ్ పో! మూడ్ పాడు చేసావ్!"

విసుక్కొన్నాడు లక్ష్మణరావు. ఆమె మాట్లాడలేదు. ఇసుకలో సున్నాలు గీస్తోంది.

"మన మారేజి అవగానే ముందు చేయాల్సిన పనేమిటో తెలుసా?"

ఆమె గీపిన సున్నాలు చెరి పేస్తూ అడిగేడు లక్ష్మణరావు.

"తెలుసు!" అంది ఆమె తలెత్తకుండానే.

"ఏవిటి?"

"వెంటనే నేను వుద్యోగానికి రిజైన్ చేయాలి!"

షాక్ తిన్నాడు అతను. నోట మాట రాలేదు.

"ఏం. మాట్లాడరేం?" తలెత్తి అడిగింది. గమ్మత్తుగా చూస్తూ.

"రిజైన్ చేయడమా?" కంగారుగా అడిగాడు.

"అవును. పెళ్ళయిన వెంటనే వుద్యోగం మానేయాలి అని అనుకొన్నా!"

"నీవు మానడానికి వీల్లేదు శశీ! నా జీతం. నీ జీతం కల్పి ఎనిమిది వందలు వస్తాయ్. హాయిగా ఆఫీసరులా విలాసంగా కులాసాగా జీవితం గడపొచ్చు! డబ్బు లేనిదే ఈ లోకంలో మనం మనలేం శశీ!"

"అవును! మీరు చెప్పింది అక్షరాలా నిజం! కానీ ఆడది మగాళ్ళ మధ్య మసలుతూంటే ఆమె కెంత యిరకాటంగా వుంటుందో మగవాళ్ళకి ఎలా తెలుస్తుంది? సాటి స్త్రీయే ఆమెపై ఎన్నో కథలు అల్లుతుంది. ఆమెను కారెక్టరు లేని స్త్రీగా చూస్తారు. ఇక మగాళ్ళ సంగతి వేరే చెప్పాలా! మన ఆఫీసులో ఎవరు ఎలా ప్రవర్తిస్తున్నారో మీకు తెలియంది కాదు"

వుద్రేకంగా చెప్పుకు పోతున్న ఆమె మొహాన్ని మసకవెల్తురులో సరిగా చూడలేక పోయాడు అతను. ఆమె మాటలు అతన్ని నిరుత్సాహపరిచాయి.

"మరి ఉద్యోగం యిప్పుడెందుకు చేస్తున్నట్లు?"

నిలతీసి అడిగాడు కోపంగా.

"తల్లిదండ్రులకు భారంగా వుండకుండా వుండడానికీ, నా డబ్బుతో నేను స్వతంత్రంగా ఖర్చు చేసుకోడానికీను"

"కాదు! వాళ్ళని పోషించడానికి!"

ఉద్రేకంగా అనేసాడు అతను.

"ఎలా అనుకొన్నా సరే!" నిర్లిప్తంగా అంది ఆమె.

"ఇంత నిర్లక్ష్యంగా మాట్లాడుతావనుకో లేదు శశీ!" కోపంగా లేచి నిలబడ్డాడు అతను.

ఆమెకూడా లేచి నిలబడింది.

"మిష్టర్ లక్ష్మణరావ్! జాగ్రత్తగానూ, సభ్యతగానూ మాట్లా

దం నేర్చుకోండి! మీరు నిజంగా నన్ను ప్రేమిస్తున్నారా!"

"అయితే నీవు నన్ను ప్రేమించ లేదా?"

ఎదురుప్రశ్న వేసాడు అతను.

ఆమెకు నవ్వొచ్చింది అతని ప్రశ్నకు.

"ప్రేమా? ఊ! బాగుంది వరస! ఏదో సరదాగా మాట్లాడాలని ఉబలాట పడుతున్నారుకదా అని నేనూ మాట్లాడాను. పిక్చరుకు రమ్మంటే వచ్చాను. అంత మాత్రాన ప్రేమించినట్లూ, పెళ్ళి చేసుకోదల్చినట్లూనా? మీ వరస మొదటనుంచీ కనిబెడుతూనే వున్నా! మీకు పాఠం చెప్పాలనిపించింది. సరే! ఎంతవరకు వెళ్తారోనని చూసాను. ప్రోత్సహించానుకూడా. మీ ఉద్దేశం అర్థం అయింది! మీ గుణం తేలిపోయింది. మీ ప్రేమా తెల్పిపోయింది. నాకూ శశిధర్ కూ మారేజి సెటిల్ అయిపోయింది. పెద్దలు వొప్పుకొన్నారు. వస్తా! గుడ్ బై!"

అంటూ గబగబా నడచుకొంటూ రోడ్డు ఎక్కిపోయింది శశిరేఖ. అతనికి నోటమాట రాలేదు. శిలాప్రతిమలా నిలబడి పోయాడు.

మర్నాడు లక్ష్మణరావు ఆఫీసుకు పోలేదు. ముప్పయి రోజులు మెడికల్ లీవ్ పెట్టేసాడు.

మూడో రోజున శశిధర్ ఆఫీసుకు వెళుతూనే శుభలేఖలు అందరికీ అందించాడు. *

---


# విజయ

## చందా వివరాలు

| | |
|---|---|
| విడి ప్రతి : | 3-00 |
| అర్ధ సంవత్సరం చందా : | 18-00 |
| సంవత్సరం చందా : | 36-00 |
| జీవిత చందా : | 200-00 |